# కుమార సంభవమ్

**"ఛా!** ఇంకా మాన్లేదూ! నేను చెప్పానుగా. ఒక్క కుమార సంభవమైతే వాడి తిక్క అదే తిరుగుతుంది. దీనికి ఏడుపెందుకే? లే, వాడు చూస్తే బాగుండదు" అంది రత్తమ్మగారు.

ఈ అనునయంతో శారదలేచి కళ్లు తుడుచుకుంది. వంటింట్లోకి వెళ్లి పీటవేసి వడ్డించసాగింది. భర్త రామం వచ్చి నిశ్శబ్దంగా కూచుని తినసాగాడు.

అసలు రోజూ రాత్రి ఎనిమిది గంటలకే రత్తమ్మగారు ఫలహారం కానిచ్చి, తన పక్కమీదికి చేరేది. తర్వాత మేనల్లుడి భార్యతో ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతూ మైమరచేది.

ఆవేళ కూడా అల్లాగే పని పూర్తిచేసికొని వచ్చేటప్పటికి, శారద తన గదిలోకి వెళ్లింది. ఆవిడ ఎంత పిల్చినారాలేదు. "ఇదేం చోద్యమమ్మా! ఎనిమిదైనా కాలేదు. అప్పుడే నిద్దరా?" అంటూ ఆగదిలోకి వెళ్లింది రత్తమ్మగారు.

శారద వెక్కి వెక్కి దుఃఖించడాన్ని గమనించింది. ఎందుకో తెల్సుకోలేకపోయింది.

"ఇదేంపనే, తీరికూచుని?" అంది. ఆవిడ రాకను గమనించి, ఆవిడ మాటల్ని విన్నాక, పొర్లి పొర్లి వస్తున్న శారద దుఃఖం యేడుపుగా మారిపోయింది.

"చూడండి, పిన్నిగారూ!" అంటూ ఆవిడ మీదపడి బేరుమంది శారద.

"ఏమిటే సంగతీ? అసలు విషయం చెప్పి మరీ గొడవ చెయ్యి" అంది రత్తమ్మగారు.

శారదకి నోటమాట రాలేదు. మనస్సెంతో బాధపడుతూ ఉంది. ఏ విధంగా చెప్పగలదు? సిగ్గనేది కూడా కొంత అడ్డు తగిలింది.

ఇంతకూ అసలు సంగతి ఏమంటే రామానికి శారదకూ పెళ్ళై నాలుగేళ్లయింది. పెళ్ళయిన రెండేళ్ల వరకూ రామం శారద నీడలా ఉండేవాడు. చూసిన వాళ్ళంతా ఇల్లాంటి ప్రేమికులు వున్నారా! అనుకునేవారు.

కాని.... తర్వాత రెండేళ్లలోనే అతనిలో చెప్పలేనంత మార్పు వొచ్చింది. శారదతో మాట్లాడ్డం - ఏదో సాంసారిక విషయాల్లో తప్పిస్తే - అపురూపమై పోయింది. క్లబ్ అలవాటు చేసుకుని ఎక్కువ కాలాన్ని అక్కడే గడప సాగాడు. శారదకిదంతా అగమ్య గోచరమైంది.

మొదట ఏవైనా దురలవాట్లకు లోబడ్డాడేమో ననిపించింది శారదకు. కాని దాంట్లో నమ్మకం కుదరలేదు. కొన్నాళ్ళకన్నా నిజం బయటపడక పోతుందా? అనుకుంది. ఏమీ తెలియలేదు.

పోనీ తన ఆకర్షణలో ఏదైనా మార్పు వచ్చిందా అంటే అదీ లేదు. చాల మంది భార్యలు - తను ఎరుగును - తమ భర్తలేకదా అని వాళ్లని ఆకర్షించడానికి ప్రయత్నించక కొత్తదనాన్ని నిలుపుకోక, వాళ్ల ప్రేమకి దూరం అవుతారు. తను అలా చెయ్యడం లేదే?

కాని కారణం , ఎంత ఆలోచించినా, కొరకబడలేదు.

"ఆయన నాతో... మాట్టాడ్డమే లేదు. నన్ను నిర్లక్ష్యం చేసి అసలు లెక్క లేనట్టు వుంటున్నారు". అని మాత్రం బలవంతాన అనగలిగింది; తక్కిన భావాలు దుఃఖతరంగంలో కలిసిపోయాయి.

"ఓసి వెర్రిదానా! దీనికేనా అంత యేడుపు! ఛా! వాడల్లాంటివాడు కాదే?" అంది రత్తమ్మ.

మరింకెలాంటివాడు? ఈ నిర్లక్ష్యమంతా ఎందుకు? ఎన్నో ప్రశ్నలు శారదలో వుదయించాయి. దుఃఖం మాత్రం తగ్గలేదు. రత్తమ్మగారు "నే చెబుతాలే! ఏడవకు" అంటూ ఓదార్చింది.

"నీ పద్ధతేం బాగులేదురా! రేపట్నించీ, ఆ క్లబ్‌లూ, గ్లిబ్బులూ మా నెయ్యి నీ ఈడు వాళ్ళంతా  ఇల్లానే వుంటున్నారా? ఇల్లు, ఇల్లాలూ... ఇవేం చూసుకోనక్కర్లే?" నెమ్మదిగా అతను అన్నం తింటుంటే మందలించింది రత్తమ్మ గారు, ఇంటికి పెద్దదిక్కుతనేనన్న స్వాతిశయంతో

రామానికిదేం అర్థమవలేదు. కాని శారద తీక్షణ భార్యకేసి చూశాడు, పరిశోధిస్తున్నట్టు. కాని శారద తీక్షణ ముఖంలో అతనికే కారణమూ కనపడలేదు.

"అల్లాగే అత్తయ్యా! కాని సాయంత్రం పూట ఏమీ తోచొద్దూ? అక్కడికిపోతే కాస్త నలుగురు  మిత్రులూ కలుస్తారేమోనని" అన్నాడు గొణుగుతూనే.

రత్తమ్మ తృప్తిపడింది. కాని శారదకిది నోటి చివరి మాటే ననిపించింది. తను ఎన్నోసార్లు ప్రాధేయపడింది. కాని పడకగది వాగ్దావాలన్నీ - వ్యర్థమయ్యాయి. కాని మేనత్త మాట? ఏమో  ఏమవుతుందో?

రామాన్ని మేనత్తే పెంచి, పెద్దచేసింది. అందుకని అతనికి ఆవిడమీద భక్తిగౌరవాలున్నాయి. లేకపోతే తల్లి తండ్రుల్ని చిన్నతనంలోనే పోగొట్టుకున్న రామానికి దిక్కూ దక్షతాలేకపోవును. అతని కృతజ్ఞతే ఆవిడ మాటల్ని జవదాటకుండా చేసేది.

రాత్రి గదిలో అడిగాడు: "అత్తయ్యతో యేం చెప్పావే?"

శారద "ఏమీ లేదు" అంది.

"సరేలే" అతనేం మాట్లాడలేదు.

రామం ప్రకృతిని చదవడం, వ్రాయడం కష్టం. అతనలా ఎందుకున్నాడు అంటే మీరూ చెప్పలేకపోవచ్చును, యెంత పరిచయమున్నా, శారద మీద ప్రేమ పోయిందా అంటే మామూలు భార్యా భర్తల మధ్య వుండే ప్రేమ లేకపోలేదు. కాని ఆ నిర్లక్ష్యానికి కారణం అవగతం కాదు. మొదటి రోజుల్లో ఎప్పుడూ శారద సరసనే వుండేవాడు. రెండు మూడు సార్లుగావును రత్తమ్మ వారించింది కూడా! అది అతను అప్పట్లో వినలేదు.

ప్రేమ పేరుతో ఆడవాళ్ళవద్ద కూచోడం కన్న ఎక్కువైన ఇతర జీవితపు విలువలు గ్రహించాడో ఏమో శారదతో కలిసికట్టుతనం తగ్గింది. ఈ మార్పు మాత్రం శారదని చాలా బాధించింది. ఓర్పు లేకుండా చేసింది.

రత్తమ్మగారు 'కుమారసంభవమైతే వాడి తిక్క అదే తిరుగుతుంది' అన్న మాటలు శారదకి మనశ్శాంతి కలిగించాయి.

అప్పుడే పెళ్ళై నాలుగు ఏళ్ళు అయింది. ఇంతవరకూ లేని సంతానం ఇప్పుడు కలుగుతుందా? ఏమో? వెయ్యి దేవుళ్ళని ప్రార్థించింది – సంతనాన్ని ప్రసాదించమని!

పురుషుల్ని సంసారంతోనూ భార్యతోనూ శాశ్వతంగా బంధించి వుంచే గొప్ప సాధనం సంతానం.

శారద కోరిక ఫలించింది. కొద్ది రోజుల్లోనే నెల తప్పింది. మనస్సు కుదుటపడింది. తన భర్తని తన బిడ్డ సహాయంతో తిరిగి తన వాణ్ణిగా చేసుకోవచ్చు. ఎన్నో ఆశాసౌధాల్ని నిర్మించుకొంది.

ఒకరోజు రత్తమ్మగారు అంది. "ఒరేయ్! నేను మనుమడ్ని యెత్తుకో బోతున్నాను"

రామం ఆశ్చర్యంగా చూశాడు.

రాత్రి గదిలో "ఇన్నాళ్ళూ చెప్పలేదేం?" అన్నాడు.

శారద సిగ్గుగా నవ్వింది. మనస్సు సంతోషంతో గెంతింది. భర్త యెంతో ప్రేమతో అడిగాడు. ఎన్నాళ్లకి ఇంత సాదరపూర్వకవాక్యాన్ని వింది? 'పిన్నిగారు' చెప్పిందినిజమే!

కుమారుడు కలిగేడు.

మూడో నెల్లో రామం బారసాల చేసుకుని అత్తారింటి నుంచి భార్యనీ, పుత్రుడ్ని తీసుకువచ్చాడు. శారదకి తన జీవితంలో కష్టాలన్నీ గట్టెక్కనట్టనిపించింది. తనకి కావల్సింది తన భర్త ప్రేమ! అది ఇంక ముందు పొందకుండా యెలా వుండగలదు?

ఆఫీసుటైంలో ఎలా వుంటాడో గాని రామం కొడుకుని విడిచి క్షణం వుండడం లేదు. శారద పని పాలివ్వడం మట్టుకు. అతని కాలక్షేపమంతా కొడుకుతోనే జీవితం రాగానే వాడికోసం యెన్నో రంగు రంగుల ఆటబొమ్మలు, అవీ తెచ్చేవాడు.

ఒకనాడు ఆఫీసర్ ఏదో అర్జంటుపని అని అంటగట్టాడు. ఇంటివద్ద చేద్దామని తీసుకొచ్చి,

పిల్లవాడితో ఆటలతో మర్చిపోయాడు. మర్నాడు ఆఫీసర్ "మీరు ఇరవై నాలుగు గంటలూ ప్రభుత్వ నౌకర్లే" అన్నాడట.

పదినెల్లు గడిచాయి. కొడుకు సాధనంగా భర్తని ఇంట్లో కట్టేసుకో గలిగినందుకు సంతోషించింది శారద. రత్తమ్మగారు కూడా ఒకటి రెండుసార్లు గావును "నేచెప్పలే" అన్నట్టు సగర్వంగా దృక్కుల్ని ప్రసరిస్తూ, నవ్వుగా చూసేది.

ఒకనాడు రాత్రి శారద తొరగా పని ముగించుకొని తన గదిలో కొచ్చింది. రామం పిల్లవాడు కేరంతాలు కొడుతుంటే ఆనందిస్తూ, ఆడిస్తున్నాడు. శారద అలా అరగంట నించుంది. అయినా అతని వీక్షణాలావిడపై పడలేదు. శారదకు యెందుకనో దుఃఖం పొర్లుకొచ్చింది.

కుర్చీపై చతికిలపడి, పమిటచెంగుతో కన్నీళ్లు తుడుచుకుంది. అవును – కుమారసంభవమైంది! కాని ఏం లాభం వొరిగింది? తన భర్త ఇంటిపట్టునే వుంటున్నాడు. తనకే మొలికింది? తనతో ఎప్పుడైనా, ఒక్కరోజైనా సాదరంగా మాట్లాడలేదే? తన ఆశలన్నీ అడియాసలైనట్టు తోచింది. అన్నాళ్ళూ కొడుకుమీద పెట్టుకున్న ఆశలన్నీ అడుగంటాయి. కొడుకు పుట్టిన ప్రయోజనం నిష్ప్రయోజనమే! ఇదివరకు తన భర్త కొన్నాళ్ళకైనా తనవాడు కాకపోడనే ధైర్యం వుండేది. ఇప్పుడది కాస్తా అడుగంటి నట్టనిపించింది. దుఃఖం పొర్లి పొర్లి రాసాగింది.

గబగబా వెళ్లి రత్తమ్మ మంచం దగ్గర కూచొని 'పిన్నిగారూ!' అని యాడవసాగింది. రత్తమ్మ మగత నిద్రలో లేస్తూ తెల్లబోయి, "ఏమే, ఇదేమిటే, ఏం కర్మ కాలిందే" అంటూ చూడసాగింది.